## క్లుప్తంగా

### శివాలయంలో ప్రత్యేక పూజలు

**మానవపాడు:** మండలంలోని అమరవాయి గ్రామంలో శుక్రవారం పండితులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులు మాల ధరించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకం, అర్చన తదితర క్రతువులు నిర్వహించారు. శివ నామస్మరణతో ఆలయం మార్మోగింది. కార్యక్రమంలో నిర్వాహకులు, మాలధారులు పాల్గొన్నారు.

### బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగింత



**మల్దకల్ :** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులు సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు స్థానిక పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఫోన్లు ట్రేస్ చేసి పట్టుకున్నారు. శుక్రవారం పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ నందికర్ బాధితులకు సెల్‌ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు వెంటనే పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్

**గట్టు :** ఏకకాల రుణ పరిష్కార పథకాన్ని (ఓటీఎస్) జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ మహబూబ్‌నగర్ తీసుకొచ్చినట్లు గట్టు పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం గట్టు సహకార కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. గట్టు సహకార బ్యాంకులో 30 ఏళ్ల క్రితం తీసుకున్న దీర్ఘకాలిక రుణాలకు సంబంధించి ఓటీఎస్ అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక రుణాలను ఓటీఎస్ ద్వారా సెటిల్ చేసుకునే అవకాశం నెల రోజుల వరకు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రుణగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత



**గట్టు :** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం గట్టు పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. ఆరగిద్ద గ్రామానికి చెందిన బోయ చిన్న రంగన్నకు చెందిన ట్రాక్టర్‌లో అర్ధరాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న క్రమంలో గస్తీ పోలీసులు కానిస్టేబుళ్లు గోకారి, సత్యభూపాల్ రెడ్డి పట్టుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలి



**అయిజ:** మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, మున్సిపల్ ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగన్న సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 14వ వార్డులోని కొత్తపేట, ఉప్పలదొడ్డి పేట, 18వ వార్డు నీలకంటేశ్వర కాలనీ, బలిజపేట కాలనీల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పర్యటించి, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఉప్పలదొడ్డి కాలనీ నుంచి ఎస్సీ కాలనీ వరకు డ్రైనేజీ నిర్మాణం లేకపోవడంతో మురుగు నీరు నిలిచిపోయిందని కాలనీ ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు

**ఎర్రవల్లి:** మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహస్వామి ఆధ్వర్యంలో రాత్రి కుంకుమార్చన పూజలు చేశారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత

**ఉండవెల్లి:** మండలంలోని పుల్లూరు గ్రామ శివారులో అక్రమంగా ఆటోలో తరలిస్తున్న 2.5 క్వింటాల పీడీఎస్ బియ్యాన్ని బ్లూ కోర్టు పోలీసులు పట్టుకున్నారు. ఆటోను స్టేషన్‌కు తరలించి డ్రైవర్ జనార్దన్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలియజేశారు.

# పల్లె వైద్యం అందేనా..?

- ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖానాలు
- గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందని వైద్య సేవలు
- ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రజల పరుగులు



జూలెకల్‌లో ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖాన

**శాంతినగర్ :** గ్రామాల్లో పల్లె దవాఖానాలు ప్రారంభానికి నోచుకోక పేదలు అల్లాడుతున్నారు. చిన్నపాటి రోగం వచ్చినా ప్రైవేటు ఆస్పత్రుల్లో నిరుపేదల జేబులకు చిల్లులు పడుతున్నాయి. గ్రామాల్లో మెరుగైన వైద్యం అందక సుదూర ప్రాంతాలకు వెళ్లి వ్యయప్రయాసలతో వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

**రూ.16 లక్షలతో నిర్మాణం..**

అలంపూర్ డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రజలకు వైద్యం అందుబాటులో ఉంచేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో పల్లె దవాఖానాలు నిర్మించేందుకు 2022లో శ్రీకారం చుట్టింది. ఒక్కో దవాఖానా నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరయ్యాయి. శాంతినగర్‌లో పట్టణ దవాఖాన, జూలెకల్, రామాపురం, కొంకల, పెద్ద పోతులపాడు, మేడికొండ, తొత్తినోనిదొడ్డి, యాపదిన్నె, తూంకుంట, పెద్ద ధన్వాడ, పెద్ద తాండ్రపాడు, మాన్‌దొడ్డి, తనగలల్లో పల్లె దవాఖానాలు మంజూరు చేశారు. స్థల సేకరణ అనంతరం ఆయా గ్రామాల్లో ఆసుపత్రుల నిర్మాణాలు మొదలుపెట్టారు.

**పూర్తికాని నిర్మాణ పనులు..**

ప్రస్తుతం 11 దవాఖానాల్లో యాపదిన్నె, శాంతినగర్ దవాఖానాలు ప్రారంభించారు. నాలుగు దవాఖానాలు 90 శాతం పూర్తవగా, 3 మధ్యలోనే పనులు ఆగిపోయాయి. మిగతా రెండు స్థల సేకరణలో జాప్యంతో పనులు మొదలు పెట్టలేదు. అంతేగాక గతంలో మంజూరైన రూ.16 లక్షలు సరిపోవని కొందరు పనులు నిలిపివేసినట్లు సమాచారం. దీంతో గత ప్రభుత్వం రూ.4 లక్షలు అదనంగా మంజూరు చేయడంతో పనులు చేసినా పూర్తవలేదని చెబుతున్నారు. అంతేగాక చేసిన పనులకు బిల్లులు రాక పెండింగ్ పెట్టినట్లు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ..**

గ్రామాల్లో ఉండే ఆర్‌ఎంపీలు వారి స్వలాభం కోసం వారికి సంబంధించిన ప్రైవేట్ ఆసుపత్రులకు రెఫర్ చేయడం, వెళ్లిన వారిని భయభ్రాంతులకు గురిచేసి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దయుంచి గ్రామాల్లో పల్లెదవాఖానాలు పూర్తి చేసి వైద్యం అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

**అందుబాటులోకి తేవాలి..**



గ్రామంలోనే ఆసుపత్రి నిర్మిస్తున్నారు బాగుంటుందని సంబరపడ్డాం. నిర్మాణం జరిగిందేగాని ప్రారంభించ లేదు. లక్షలు పోసి నిర్మించిన ఆసుపత్రి ప్రజలకు ఉపయోగపడటం లేదు. రెండేళ్లుగా ఆసుపత్రి గురించి ఎవరు పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే వైద్య సేవలు అందుబాటులోకి తేవాలి.

– ఎస్.దామోదర్, జూలెకల్, వడ్డేపల్లి

**వెంటనే పూర్తి చేయాలి..**



గ్రామంలో నిర్మిస్తున్న పల్లె దవాఖాన పనులు వెంటనే పూర్తిచేసి నిరుపేదలకు వైద్య సేవలు అందుబాటులోకి తేవాలి. అలంపూర్ చౌరస్తాలో 100 పడకల ఆసుపత్రి నిర్మించి వదిలేశారు. లక్షలు పోసి ప్రైవేట్‌లో వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి.

– శేఖర్, జూలెకల్, వడ్డేపల్లి మండలం

**పూర్తి చేయిస్తాం..**

అసంపూర్తిగా ఉన్న పల్లె దవాఖానాల పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. గతంలో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా పనులు చేపట్టారు. నిలిచిపోయిన పనులను పంచాయతీరాజ్ శాఖ వారికి అప్పగించారు. సమస్యలు తెలుసుకుని, కాంట్రాక్టర్లతో మాట్లాడి పూర్తిచేయిస్తాం. పనులు పూర్తయిన వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

– రెడ్డప్ప, పంచాయతీరాజ్‌శాఖ డీఈ, అలంపూర్

# సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

**కేటీదొడ్డి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ప్రజా సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతు భరోసా సర్వే పడడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియపై శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న పథకాలపైన గ్రామాల్లో ఎంపికైన లబ్ధిదారుల తుది జాబితా రూపొందించడం, రైతు భరోసా పథకం కింద బోగస్ లబ్ధిదారులను గుర్తించడం, ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులు లబ్ధిపొందేలా చూడాలన్నారు. రైతు భరోసా పథకంలో భాగంగా సాగుకు యోగ్యం లేని భూముల వివరాలు నమోదు చేయకూడదన్నారు. రాళ్లు గుట్టల భూములు పరిశీలించాలని సూచించారు. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాహిదాబేగం, ఏడీఏ సంగీత, ఎంపీఓ కృష్ణమోహన్, ఆర్‌ఐలు ఉదయ్, దేవేందర్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఓ, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.



కేటీదొడ్డిలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

**కొనసాగుతున్న సర్వే పనులు..**

**అయిజ :** ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల రెవెన్యూ, వ్యవసాయ అధికారులు రైతు భరోసాకు సంబంధించిన సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. రైతు భరోసా పథకం నుంచి సాగుకు యోగ్యం కాని భూములు క్షేత్రస్థాయిలో గుర్తించే ప్రక్రియ రెండో రోజు కొనసాగింది. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతి, మండల వ్యవసాయ అధికారి జనార్దన్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది డెస్క్ వర్క్ పనులు చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన నియమాల ప్రకారం లేఅవుట్లు, నాలా కన్వర్షన్, రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలు, గోదాములు, మైనింగ్‌కు వినియోగస్తున్న భూములు గుర్తించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు

**రాజోళి:** మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలో లక్ష్మీ మాధవస్వామి జాతర సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. పోటీల్లో ప్యాపిలి జట్టు మొదటి స్థానంలో నిలువగా చిన్న ధన్వాడ మాజీ సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి రూ.50 వేల నగదు అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన పచ్చర్ల జట్టుకు మాన్‌దొడ్డి ట్రాక్టర్స్ యూనియన్ రూ.30 వేలు, మూడో స్థానంలో నిలిచిన తనగల గ్రామ జట్టుకు రూ.20 వేలు అలంపూర్ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కుమార్ అందజేశారు. నాల్గవ స్థానంలో నిలిచిన గద్వాల జట్టుకు కువర వెంకటేష్ రూ.10వేలు నగదు అందజేశారు. ఉత్తమ రైడర్, బెస్ట్ క్యాచర్లకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తహీనత నివారణకు సరైన పోషణ అవసరం

**మానవపాడు:** గర్భిణుల్లో రక్తహీనత నివారణకు సరైన పోషణ అవసరమని డాక్టర్ సింధు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం కలుకుంట్ల, మద్దూరు, బుర్దిపాడు గ్రామాల ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రక్త నమూనాలు సేకరించి టీ–హబ్ వాహనం ద్వారా గద్వాల్‌కు కిట్టు పంపించినట్లు తెలిపారు. రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సి ఆహారపదార్థాలు, ఐరన్‌మాత్రలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీర్లిన్‌జెమ్స్, చంద్రన్న, దేవమ్మ, ఆశలు తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సింధు

### ఘనంగా జంగిల్ సాబ్ ఉర్సు

**ధరూరు :** మండల పరిధిలోని నీలహళ్లి గ్రామంలో జంగిల్ సాబ్ ఉర్సు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం ఉత్సవాల్లో నడిగడ్డ రైతు హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగ్లి రంజిత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ బుచ్చిబాబు, మల్దకల్ మండల అధ్యక్షుడు విష్ణు, సభ్యులు గోవిందు, మల్దకల్, ప్రేమ్‌రాజ్, రంగస్వామి, రమేష్, భూపతి నాయుడు, నాఏష్, దొడ్డన్న, సుదర్శన్, అంజి తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న రంజిత్ కుమార్

# ఫిబ్రవరి 7న ‘చలో హైదరాబాద్’

**అలంపూర్ రూరల్ :** ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్‌లో జరిగే వెయ్యి గొంతుకలు లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డప్పు కళాకారుల జిల్లా ఉపాధ్యక్షుడు జగ్జీవన్ మాదిగ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని సూల్తాన్‌పూర్, జిల్లెలపాడ్ గ్రామాల్లో శుక్రవారం డప్పు కళాకారుల కమిటీలు ఏర్పాటు చేశారు. సూల్తాన్‌పూర్ గ్రామంలో డప్పు కళాకారుల అధ్యక్ష, కార్యదర్శులుగా రాముడు , బాబు, రాఘవేంద్ర, ఉపాధ్యాక్షుడిగా గోపాల్, సహయ కార్యదర్శిగా సి.రాముడు, కోశాధికారి కుర్మన్న, కార్యవర్గ సభ్యులుగా శ్రీను, వెంకటస్వామి, నాగరాజు, దానం, జిల్లెలపాడ్ గ్రామంలో అధ్యక్ష కార్యదర్శులుగా ఆంజనేయులు, సవరన్న, నర్సింహ, ఉపాధ్యాక్షుడిగా చిన్న మద్దిలేటి, సహాయ కార్యదర్శిగా లాలు, కోశాధికారిగా చిన్న, కమిటీ సభ్యులుగా నాగరాజు, మద్దిలేటి, చిన్న సవారి, నాగరాజు, రాముడును ఎన్నుకున్నట్లు జగ్జీవన్ మాదిగా తెలిపారు. మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ప్రతి ఒక్క డప్పు కళాకారుడు ఫిబ్రవరి 7న జరిగే కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



కమిటీ సభ్యులతో జగ్జీవన్ మాదిగ

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

**అలంపూర్:** అయిజ మండలం బింగిదొడ్డి గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో అతనికి వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ.28,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే విజయుడు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాగేశ్వర్ రెడ్డి, నాగేష్, మహేష్, శేఖర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# హోరాహోరీగా బల ప్రదర్శన పోటీలు

**ఎర్రవల్లి:** ఇటిక్యాల మండల పరిధిలోని వావిలాల గ్రామంలో శివాంజనేయస్వామి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం సీనియర్ విభాగం బండలాగుడు, చందరాళ్లు, దొబ్బుడుగుండ్లు, గుబ్బలగుండు, ఇసుక సంచి ఎత్తడం పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పోటీ దారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ విభాగం బండలాగుడు పోటీల్లో పీ.ఆర్ పల్లికి చెందిన నాగయ్య ఎద్దులు 3000 ఫీట్లు లాగి మొదటి బహుమతి రూ.60వేలు, యాదిరెడ్డిపల్లికి చెందిన అఖిలేష్‌రెడ్డి ఎద్దులు 2893.5 ఫీట్లు లాగి రెండో బహుమతి రూ.50వేలు, గార్లదిన్నెకు చెందిన రామాంజనేయులు ఎద్దులు 2744 ఫీట్లు లాగి మూడో బహుమతి రూ. 40వేలు, మేడు మాకుపల్లికి చెందిన తోట తిరుపాల్‌రెడ్డి ఎద్దులు 2703.5 ఫీట్లులాగి నాల్గవ బహుమతి రూ.30వేలు, జిల్లెలకు చెందిన గొటికె నాగిరెడ్డికి చెందిన ఎద్దులు 2700.9 ఫీట్లు లాగి ఐదో బహుమతి రూ. 20వేలు, కానాలకు చెందిన గుండం చెన్నారెడ్డి ఎద్దులు 2700 ఫీట్లు లాగి ఆరో బహుమతి రూ.10వేల నగదును కైవసం చేసుకున్నాయి. అదే విధంగా చందరాళ్లు, దొబ్బుడుగుండ్లు, గుబ్బలగుండు, ఇసుక సంచి ఎత్తు పోటీల్లో హోరాహోరీగా సాగాయి. ఇసుక సంచి 160 కేజీల బల ప్రదర్శనలో దేవదుర్గకు చెందిన పరుశరామ్ నాయక్ మొదటి బహుమతి రూ.5 వేలు, ఇరిగెరకు చెందిన శంకరప్ప రెండో బహుమతి రూ.4 వేలు కైవసం చేసుకున్నారు. అలాగే 90 కేజీల గుబ్బల గుండు బలప్రదర్శన పోటీలో సోముల గూడూరుకు చెందిన శివ మొదటి బహుమతి రూ.5 వేలు, అదే గ్రామానికి చెందిన గజ్జన్న రెండో బహుమతి రూ.4 వేలు, తాండ్రపాడుకు చెందిన శ్రీనివాసులు మూడో బహుమతి రూ.3 వేల నగదు కైవసం చేసుకున్నారు. విజేతలకు మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి శాలువాలతో సత్కరించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి, వావిలాల రంగారెడ్డి, మాణిక్యారెడ్డి, కృష్ణారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రామయ్య, ఆలయ పాలక మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీల్లో సత్తా చాటుతున్న ఎద్దులు

# రైతులు అధైర్యపడొద్దు



ఆర్డీఎస్ కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

**అయిజ:** టీబీ డ్యాం నుంచి సాగునీటి విడుదల చేశారని ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు అధైర్యపడొద్దని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం ఆర్డీఎస్ డీఈఈ సచ్చింద్రనాథ్ సేథ్‌తో కలిసి మండలంలోని డిస్ట్రిబ్యూటర్ 18 వద్ద ఆర్డీఎస్ కాలువను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అలంపూర్ నియోజకవర్గంలోని రైతులు ఆర్డీఎస్ ఆయకట్టులో సాగు చేస్తున్న పంటలు సాగునీరు లేకపోవడంతో ఎండిపోతున్నాయని, సమస్యను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, టీబీ డ్యాం అధికారులతోపాటు తెలంగాణ, ఏపీ ఇరిగేషన్ శాఖల అధికారులతో మాట్లాడి సకాలంలో సాగునీరు విడుదల చేయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్డీఎస్ అధికారులు రామదాసు, గోవర్ధన్ రెడ్డి, హేమంత్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు నాగేశ్వర్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, తిమ్మారెడ్డి, రవిరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, భార్గవ్, వెంకటేష్, పరుశరామ్, బషీర్, సాయిచరణ్ రెడ్డి, గజేందర్ రెడ్డి, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో రేషన్ కార్డుల పరిశీలన



రేషన్‌కార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ పద్మావతి

**అలంపూర్ రూరల్:** మండల పరిధిలోని గ్రామాల్లో రేషన్ కార్డుల పరిశీలన కొనసాగుతోంది. లింగన్‌వాయి గ్రామంలో కొనసాగుతున్న రేషన్ కార్డుల పరిశీలనను శుక్రవారం ఎంపీడీఓ పద్మావతి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఓబులమ్మ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ‘కాన్షీరాంపై అనుచిత వ్యాఖ్యలు తగదు’



మాట్లాడుతున్న ఆకేపోగు రాంబాబు

**గద్వాలన్యూటౌన్:** బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాంపై మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, తక్షణమే క్షమాపణలు చెప్పాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆకేపోగు రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు సాధించిన, ఒక మహిళను నాలుగు సార్లు ముఖ్యమంత్రిని చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. రాష్ట్రంలో సీఎం చేస్తున్న రాజకీయాలపై మాట్లాడాలని మురళికి హితవు పలికారు. దేశంలో నైతిక విలువలతో కూడిన రాజకీయం చేసిన ఏకైక పార్టీ బీఎస్పీ అని అన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్, సవారన్న, పాండు, ఆకేపోగు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

**రాజకీయ లబ్ధికోసమే దిగజారుడు వ్యాఖ్యలు**

**ఇటిక్యాల :** రాజకీయ లబ్ధి కోసమే మాజీ కలెక్టర్ ఆకునూరి మురళి దిగజారుడు వ్యాఖ్యలు చేశారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ కార్యకర్తలతో కలసి ఆయన మాట్లాడారు. బీఎస్పీ వ్యవస్థాపకుడు మాన్యశ్రీ కాన్షీరాంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆకునూరి మురళి తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిమోతి, జయరాం, ఆదాము, శివన్న, బాష తదితరులు పాల్గొన్నారు.

### పశువులకు టీకాలు వేయించాలి



పశువులకు చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు

**కేటీదొడ్డి:** పశువులకు వ్యాధులు రాకుండా తప్పనిసరిగా నిరోధక టీకాలు వేయించాలని జిల్లా వెటర్నరీ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కుచినెర్లలో పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు చేశారు. దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు వినయ్, వెంకటరాజ్, వెంకటేష్, సూపర్‌వైజర్ రవికుమార్, గోపాల్ మిత్రలు గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చౌడేశ్వరీదేవి ఆశీస్సులు ఉండాలి

**గట్టు :** చౌడేశ్వరీదేవి ఆశీస్సులు అందరిపై ఉండాలని బీఆర్‌ఎస్ నేత బల్గెర హనుమంతునాయుడు అన్నారు. పెంచికలపాడు గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ చౌడేశ్వరీదేవి జాతర సందర్భంగా గురువారం రాత్రి నిర్వహించిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర నాటకాన్ని ఆయన ప్రారంభించారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక యుగంలో కూడా వీధి నాటకాలను పల్లె జనాలు ఇప్పటికి ఆదరిస్తున్నారనడానికి పెంచికలపాడులో ప్రదర్శిస్తున్న బ్రహ్మంగారి నాటకమే ఉదాహరణ అని తెలిపారు. కళాకారులకు, నాటక ప్రదర్శనను తిలకించడానికి వచ్చిన జనాలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అంగడి బస్వరాజు, నూర్‌పాష, నర్సింహులు, రామునాయుడు, వెంకటేష్, కొళాయి భాస్కర్, తిమ్మప్పగౌడ్, బాసు గోపాల్, కంగారు తిమ్మప్ప, నాగరాజు, వీరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మంగారి నాటకాన్ని ప్రారంభిస్తున్న హనుమంతునాయుడు

### సర్వే నమోదులో అధికారుల నిర్లక్ష్యం



వినతిపత్రం అందజేస్తున్న యువకులు

**ఉండవెల్లి :** మండలంలోని చిన్న ఆముదాలపాడు గ్రామంలో నూతన రేషన్ కార్డు సర్వేలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ భాస్కర్, తహసీల్దార్ హరికృష్ణకు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. చిన్న ఆముదాలపాడులో అధికారులు సర్వే నిర్వహించకుండా సిబ్బంది చెప్పిన విధంగా నమోదు చేసినట్లు ఆరోపించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు విజయులు, రమేష్, స్వాములు, సుదాకర్, రంజిత్, వెంకటేష్, నరసింహ, మహేష్, రాముడు పాల్గొన్నారు.

# రాష్ట్ర సదస్సు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న హలీంపాష

**గట్టు :** ఈనెల 18న కొత్తగూడెంలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష కోరారు. శుక్రవారం పెంచికలపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాష మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నట్లు ఆరోపించారు. కార్పోరేట్ విధానాలకు అనుగుణంగా కార్మికుల శ్రమ దోపిడి విచ్చలవిడిగా సాగిస్తున్నట్లు ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 29 కార్మిక చట్టాల పునరుద్ధరణ, నాలుగు లేబర్ కోడ్‌ల ఉపసంహరణ, ఉద్యోగ ఉపాధి వేతనాల పెరుగుదల కోసం, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సన్నద్ధం కావాలని కోరారు. కొత్తగూడెంలో జరిగే సదస్సుకు కార్మిక వర్గాలన్ని తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నర్సింహులు, పరమేష్, పరుశరాం, అంజి, పరుశరాముడు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.